లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర విద్యుత్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

కీసర: చీర్యాలలోని శ్రీలక్ష్మీనృసింహస్వామిని శనివారం తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేద పండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలతో ఘనంగా ఆశీర్వచనం చేశారు. ఆలయ ధర్మకర్త శ్రీహరి, భక్తులు పాల్గొన్నారు.

'తపస్' ఆధ్వర్యంలో 'సీపీఎస్ విద్రోహ దినం'

మేడ్చల్: తపస్ ఆధ్వర్యంలో సీపీఎస్ విద్రోహ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తపస్ రాష్ట్ర కార్యదర్శి నవీన్, జిల్లా సంఘటనా కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామారావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

ఘట్‌కేసర్: సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో దివంగత ఉద్యమనేత సురవరం సుధాకర్‌రెడ్డికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయన చేసిన పోరాటాలు, ఉద్యమాల గురించి స్మరించుకున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జయచంద్ర, సీపీఎం మండల కార్యదర్శి ఈశ్వర్, బాలకృష్ణ, రాంకుమార్, శివ, శరణ్, టిల్లు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఘట్‌కేసర్: ఏదులాబాద్ వినాయకసాగర్ (శ్రీలక్ష్మీనారాయణ చెరువు)ను ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ శనివారం పరిశీలించారు. నిమజ్జనం ఏర్పాట్లు, భక్తులకు కల్పించనున్న సౌకర్యాల వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనానికి తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఎస్సై శేఖర్, ట్రాఫిక్ ఎస్సై విజయకృష్ణ, స్థానికులు శ్రీనివాస్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

భూ కబ్జాకు యత్నం.. కేసు నమోదు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 2/1లో 'రహేజా మైండ్ స్పేస్' కంపెనీకి చెందిన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. రహేజా కంపెనీ దగ్గర రోడ్డును ఏర్పాటు చేసేందుకు జేసీబీతో రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి పనులు చేపట్టాడు. ఈ క్రమంలో రహేజా కంపెనీకి చెందిన స్థలాన్ని ఆక్రమిస్తూ రోడ్డు పనులు చేపట్టాడు. కంపెనీ స్థలాన్ని చట్టవిరుద్ధంగా ఆక్రమించి రోడ్డు పనులు చేస్తున్నారని అతడిపై కంపెనీ ప్రతినిధి చంద్రశేఖర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మున్సిపల్ కాంట్రాక్టర్‌నని నిందితుడు చెబుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బొమ్మలు చేసి.. ప్రాణం పోసి !

నవరాత్రి ఉత్సవాలకు వినాయకులు సిద్ధం

- రాజస్థాన్ కళాకారుల చేతిలో రూపు దిద్దుకున్న విగ్రహాలు
- వివిధ ఆకృతుల్లో గణపయ్యలు లభ్యం



ఉత్సవాలకు కొలువైన గణనాథులు

ఘట్‌కేసర్: గణాలకు అధిపతి, విఘ్నాలు తొలగించి విజయాన్ని అందించే విఘ్నేశ్వరుడంటే అందరికి ప్రీతిపాత్రం. అందుకే వినాయకుడిని పూజించనిది ఎలాంటి పూజాది కార్యక్రమాలు, శుభకార్యాలు ప్రారంభించరు. ఆగస్టు 27 నుంచి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానుండంతో ప్రతి గల్లీలో సందడి నెలకొననుంది.

◆ ఉమ్మడి ఘట్‌కేసర్ మండలంలోని ఘట్‌కేసర్ మైసమ్మగుట్ట, యానంపేట్, జోడిమెట్ల, నారపల్లి, మేడిపల్లిలో తయారైన గణపయ్యలు వాడవాడలా సందడి చేయనున్నారు. వివిధ రూపాలు, ఆకారాలు, రంగుల్లో గణనాథులు అందంగా ముస్తాబయ్యారు.

8 నెలల ముందే పనిలో నిమగ్నం..

రాజస్థాన్ రాష్ట్రం ఫాలే జిల్లా చోటీ సాదడీ గ్రామానికి చెందిన కళాకారులు 10- 15 ఏళ్లుగా స్థానికంగా విగ్రహాలు తయారు చేస్తున్నారు. పండుగ పూర్తి కాగానే కొద్ది రోజులు సొంతూరుకు వెళ్తారు. తిరిగొచ్చి రకరకాల దేవతావిగ్రహాలు, బొమ్మల కొలువులో అలంకరించే జంతువులు, పక్షుల బొమ్మలు, ఇతర బొమ్మలను తయారుచేసి స్థానికంగా విక్రయిస్తూ.. ఉపాధిని పొందుతున్నారు.



ఛత్రపతి శివాజీమహారాజ్‌తో గణపయ్య

పెరిగిన నిర్వహణ వ్యయం...

కుటుంబసభ్యులే కాకుండా రాజస్థాన్ నుంచి దినసరి కూలీలను తీసుకొస్తారు. రోజుకు మగవారికి రూ. 2 వేలు, మహిళకు రూ. వేయి చెల్లించి వారికి భోజనం సమకూరుస్తారు. రంగులు వేయడానికి ఇతర పనులకు అవసరమైన యంత్రాలకు వినియోగించిన కరెంట్ బిల్, స్థలం అద్దె తడిసి మోపెడవుతుందని అంటున్నారు. రాజస్థాన్ నుంచి కడియా మట్టి, మహారాష్ట్ర పూణే నుంచి రంగులు, కేరళ, తమిళనాడు నుంచి కొబ్బరిపీచును కొనుగోలు చేస్తారు. గతేడాది కంటే ఈసారి ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని, వ్యయం పెరిగినా విగ్రహాల తయారీ ఆపేదిలేదంటున్నారు. గతేడాది పెట్టుబడులకే సరిపోయిందని, ఈసారి పెద్ద ఎత్తున విక్రయాలు జరగాలని గణపయ్యను వేడుకుంటున్నామన్నారు.

అందుబాటులో విగ్రహాలు..

ఇక్కడ తయారు చేసిన విగ్రహాలను స్థానికులే కాకుండా భువనగిరి, ఆలేరు, జనగాం నుంచి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. పరిమాణాన్ని బట్టి రూ. 40 వేల నుంచి రూ. 50 వరకు విక్రయిస్తున్నారు. ఏటా శ్రమపడి విక్రయిస్తే కుటుంబానికి రూ.50 వేల వరకు మిగులుతుందని అంటున్నారు.

వ్యాపారం తగ్గినా.. వృత్తిని వదిలిపెట్టం



ఏళ్లుగా విగ్రహాలను తయారు చేస్తున్నాం. ఒక్కోసారి పెట్టుబడులు కూడా రావు. అన్ని ఖర్చులు పోను కుటుంబానికి రూ. 40-50 వేల వరకు మిగులుతుంది. వ్యాపారం ఎలా ఉన్నా.. విగ్రహాల తయారీని మాత్రం వదిలి పెట్టం. గిరాకీ ఇప్పుడిప్పుడే పెరుగుతోంది.

– గోవింద్, విగ్రహాల తయారీదారుడు

నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

నిమజ్జనానికి వచ్చే వారికి ఇబ్బంది లేకుండా చూడాలని సూచన



శామీర్‌పేట చెరువును సందర్శించిన కలెక్టర్ మను చౌదరి

శామీర్‌పేట్: వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట్ పెద్దచెరువులో జరిగే నిమజ్జన ఏర్పాట్లను శనివారం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీసీపీ కోటిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతేడాది నిమజ్జన సమయంలో జరిగిన తప్పిదాలను అధిగమిస్తూ..తగిన ఏర్పాట్లను పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. చెరువు ప్రమాద స్థలాలను గుర్తించి బారికేడ్లు ఏర్పాటు చేసి, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, ఇరిగేషన్, విద్యుత్, పోలీస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పేస్ టెక్నాలజీపై అవగాహన అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఆర్డీఓ సైంటిస్ట్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు స్పేస్ టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్డీఓ సైంటిస్ట్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్సీఈ కళాశాలలో నేషనల్ స్పేస్ డే ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్పేస్ టెక్నాలజీ వల్ల దేశంలో వస్తున్న మార్పులు, మానవ జీవితంపై ప్రభావంపై విద్యార్థులకు వివరించారు. భారతీయ అంతరిక్ష స్టేషన్ నెలకొల్పడం దేశానికి గర్వకారణం అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, హెచ్ఓడీ సంపత్‌కుమార్, డీన్ సంధ్యారాణి, నర్సింహ్మారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువుల ఆసుపత్రి సీజ్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అధికారులు ఎలాంటి అనుమతులు (లైసెన్స్) లేకుండా అనధికారికంగా నిర్వహిస్తున్న పెంపుడు జంతువుల ఆసుపత్రిని శనివారం సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లిలో 'హెల్తీ పెట్ యానిమల్' ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. వీరికి శాఖాపరంగా ఎలాంటి అనుమతులు లేవని నిర్ధారించారు. ఆసుపత్రిలో జంతువులకు సంబంధించి అక్రమంగా నిల్వ ఉంచిన 40 రకాల మందులు, ఫిజీసియన్‌కు సంబంధించిన మరో 5 రకాల మందులను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. లైసెన్స్ లేని వ్యక్తులు, సంస్థలకు మందులు విక్రయిస్తే నేరమేనని, అలాంటి హోల్‌సేల్ డీలర్స్ పైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో డీసీఏ మేడ్చల్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మోనిక, గీతాంజలి పాల్గొన్నారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న రవీందర్‌రెడ్డి

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ మల్లారెడ్డి ఇంజినీరింగ్ అండ్ మెనేజ్‌మెంట్ కళాశాలలో గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్ గణితశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ రవిందర్‌రెడ్డి హాజరై విద్యార్థులను అభినందించి దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేసి వారు భవిష్యత్తులో ధృఢ సంకల్పంతో ఎదగాలని కోరారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉద్యోగంతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి, కిష్టారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుబ్బరత్నం, సత్యనారాయణ, విశ్వనాథం, భరతసింహారెడ్డి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై రైతులంతా ఏకమై పోరాటం



సమావేశంలో పాల్గొన్న రైతులు, నాయకులు

మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: రుణమాఫీ అయ్యేంత వరకు విశ్రమించేది లేదని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఏదులాబాద్ డీఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో 1200 మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేశామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలోని రైతులందరికీ రుణమాఫీ చేసేంత వరకు రైతులు ఏకమై పోరాటం చేయాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ఉదయ్‌రెడ్డి, ధర్మారెడ్డి, బాల్‌రాజ్‌యాదవ్, గౌరీశంకర్, రైతులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్



ఘట్‌కేసర్: చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 21న ఘట్‌కేసర్ సర్వేనెంబర్ 9లోని వ్యవసాయక్షేత్రం పెద్దమ్మతల్లి ఆలయం సమీపంలో ఉన్న గదితాళం పగులగొట్టి వ్యవసాయ పనిముట్లు, సర్వీస్ వైర్, స్టీల్, స్విచ్‌బోర్డులు తదితర రూ.12 వేలు విలువ చేసే వస్తువుల చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఘట్‌సర్‌కు చెందిన సత్తి, అలియాస్ మంగల్ సత్తి చోరీ చేశాడని పోలీసుల విచారణలో తేలింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కీసర రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం

కీసర: శ్రావణమాసం చివరిరోజు అమావాస్య కావడంతో శనివారం కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి తైలాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి వారికి పంచామృతాభిషేకం, ఆకుపూజ చేపట్టారు. అమావాస్య కావడంతో భక్తులు అధికసంఖ్యలో హాజరై పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నారాయణశర్మ, ఈవో కట్టా సుధాకర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్ వెంకటేషశర్మ, రమేష్‌శర్మ, ఉమాపతిశర్మ, నాగలింగంశర్మ, ట్రస్ట్ బోర్డు సభ్యులు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

స్వయం ఉపాధితో రాణించాలి



ఘట్‌కేసర్: స్వయం ఉపాధితో జీవితంలో రాణించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. అంకుషాపూర్‌లోని రవితేజ రిసార్ట్స్‌ల శనివారం ఏర్పాటు చేసిన సంకల్ప్ (సెల్ఫ్ బిజినెస్ మీటింగ్) సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొవ్వొత్తుల తయారీ, సబ్బు, డిజర్జెంట్, పుట్టగొడుగుల పెంపకం, ఊరగాయల ఉత్పత్తి తదితర అంశాల్లో ఆదాయం పొందవచ్చన్నారు. గృహ ఆధారిత వ్యాపారం ఎంపిక చేసుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం గడించాలన్నారు. యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లేష్, నాయకులు రాజు, ప్రోగ్రామ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసి స్థానిక నేతలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌ను శనివారం పలువురు స్థానిక నేతలు కలిశారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటగోపాల్‌ను మున్సిపల్ పరిధిలోని గౌడవెల్లి, పలు గ్రామాల నాయకులు కలిసి స్వాగతం పలికారు.



మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, భాను, కృష్ణయాదవ్, సింహాల్ యాదవ్, సదానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్



అభిషేక్

పోచారం: గంజాయి కేసులో నిందితుడిగా వ్యక్తిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవి తెలిపిన ప్రకారం.. ఇటీవల ఘట్‌కేసర్ టోల్ ప్లాజా వద్ద అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముద్దాయిగా ఉన్న అభిషేక్ ఘోడే (24)ను బీదర్‌లోని షంషేర్‌పూర్‌లో అతడి ఇంటి వద్ద స్థానిక పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

ఉచిత వైద్య శిబిరం

మేడ్చల్: పట్టణంలోని పాపారాయ విద్యానికేతన్‌లో ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. లయన్స్ క్లబ్, మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయగా.. వైద్యులు శిబిరానికి హాజరైన విద్యార్థులు, తల్లింతండ్రులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ మహేష్, స్కూల్ డైరెక్టర్లు రామేశ్వర్ రెడ్డి, నర్సింహులు, ఆంజనేయులు, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక కొరవడి.. ప్రగతి మొక్కుబడి

పురపాలికల్లో వంద రోజుల కార్యక్రమం తీరిది

- జూన్ 2 నుంచి మొదలై.. సెప్టెంబర్ 10 వరకూ..
- ప్రణాళికను పట్టించుకోని పురపాలక కమిషనర్లు
- మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 34 పురపాలికలు



కాప్రా సర్కిల్‌లో కుంగిపోయిన రహదారి..



పోచారంలో బురదమయంగా రోడ్డు..

సాక్షి,మేడ్చల్ జిల్లా: పురపాలక సంఘాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణ, వివిధ అభివృద్ధి పనులు, స్వశక్తి సంఘాల ఆర్థికాభివృద్ధి తదితర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించేలా ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. 'ఒక మార్పు.. అభివృద్ధికి మలుపు' నినాదంతో రోజుకో కార్యక్రమం నిర్వహణకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగనుండగా.. ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో మొక్కుబడి తంతుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల సమన్వయ లోపం..

పురపాలికల్లో నిధుల కొరతకు తోడు అధికారులు మధ్య సమన్వయ లోపం, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 34 పురపాలక సంఘాల పరిధిలో కార్యక్రమం ప్రారంభమై 82 రోజులు గడిచినా.. పనులు నామమాత్రంగా సాగుతున్నాయి. మిగిలిన 18 రోజుల్లో స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తేనే పూర్తిస్థాయి లక్ష్యం నెరవేరనుంది. 100 రోజుల ప్రణాళికలో ఎక్కువగా పారిశుద్ధ్యంపైనే పుర అధికారులు దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి, ఆదాయంపై కనిపించని పురోగతి

తడి, పొడి, హానికర చెత్త వర్గీకరణపై మహిళలకు అవగాహన సదస్సులు, ర్యాలీల నిర్వహణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. నల్లాల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేయడంతో పాటు హోం ఫుడ్ తయారీపై ప్రదర్శనలు నిర్వహించారు. రోడ్ల మరమ్మతులు, వీధిలైట్లు, వనమహోత్సవం, మురికి కాల్వల పరిశుభ్రత, దోమల నివారణకు ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపు, కుక్కల నియంత్రణ, ఇంటి నెంబర్లు, అనుమతిలేని కట్టడాలు, ట్రేడ్ లైసెన్స్‌లు, కూడళ్లు, ఉద్యానవనాల తదితర వాటి అభివృద్ధి, ఆదాయం పెంపుపై ఏమాత్రం దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. పలువురు ఉద్యోగులు, సిబ్బంది వంద రోజుల ప్రణాళిక పక్కన బెట్టి సొంత వ్యాపకాలపై ప్రత్యేక చర్యలకు పూనుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వర్షాలతో దెబ్బతిన్న రహదారులు

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. అంతర్గత రోడ్లు మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. తడి, పొడి చెత్త కూడా వేర్వేరుగా సేకరించడం లేదు. కాలనీల్లో డ్రైనేజీలు లేక పారిశుద్ధ్యం లోపిస్తోంది. రోడ్ల పక్కను చెత్తను డంప్ చేయడం వల్ల వాహనచోదకులు దుర్వాసన భరించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

◆ పోచారం మున్సిపాలిటీ పరిధిలో ఓఆర్ఆర్‌కు ఆనుకుని సర్వీస్ రోడ్డు పక్కన అనాధికారికంగా ఏర్పాటు చేసిన డంపింగ్‌లోని చెత్త, కాల్చుతున్న మంటలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల కొరతతో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు.

◆ ఘట్‌కేసర్, బోడుప్పల్, పోచారం, జవహర్‌నగర్ తదితర పురపాలక సంఘాల్లో కూడళ్ల అభివృద్ధి చేపట్టకపోవడంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి.

◆ శివారు కాలనీల్లో సీసీరోడ్లు లేకపోవడంతో మట్టి, మొరం రోడ్లపైనే వరద నీరు నిలవడంతో పాటు మురుగు కాల్వలు లేక బురదమయంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. శివారు కాలనీల్లో మురుగు నిలిచి దోమల బెడద అధికమవుతోంది. పాత మురికి కాల్వలు దెబ్బతిన్నా.. నిధులు లేకపోవడంతో కొత్తవి నిర్మించడం లేదు.

తాగునీటి సమస్య..

పురపాలికల్లోని పలు కాలనీల్లో తాగునీటి సమస్య నెలకొంది. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం లేకపోవడంతో ఉద్యానవనాల నిర్మాణాలు చేపట్టడం లేదు. పోచారంతో సహా పలు పురపాలక సంఘాల్లో వీధిలైట్ల సమస్య తీవ్రంగా ఉంది.

తరచుగా రోడ్డు ప్రమాదాలు

ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వరకు ఉన్న హైదరాబాద్ -వరంగల్ జాతీయ రహదారిలో వీధిలైట్లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ఈ రహదారిలో ఫ్లై ఓవర్ రోడ్డు పనులు జరుగుతుండటంతో వాహనదారులు భయాందోళకు గురౌతున్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో ప్రజలు ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, చెత్త, చెదారం, డంపింగ్‌యార్డు, తాగునీరు, పార్కుల వంటి అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణ కొరవడటంతోనే ఈ సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.